క్లుప్తంగా

సభలపై జీవోను నిరసిస్తూ అంబేడ్కర్‌కు వినతి

ఆరిలోవ: రోడ్లపై బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించ వద్దంటూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను రద్దు చేయాలని కోరుతూ టీడీపీ నాయకులు గురువారం పెదగదిలి కూడలిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జీవో జెరాక్స్ కాపీలను దహనం చేశారు. జీవోను రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ 9, 12 వార్డుల నాయకులు బుడుమూరు గోవింద్, ఒమ్మి అప్పలరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రకవచ ధారణలో శ్రీవారు



ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు

ఎంవీపీ కాలనీ: సెక్టార్–6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం 21వ పాసుర విన్నపాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. వేంకటేశ్వరస్వామితో పాటు పద్మావతి దేవి, గోదాదేవి అమ్మవార్లను వజ్రకవచాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం జరిగిన తీర్థప్రసాద గోష్టిలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

28వ వార్డులో జెడ్సీ పర్యటన



సిబ్బందితో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ శివప్రసాద్

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో జోనల్ కమిషనర్ శివప్రసాద్ గురువారం పర్యటించారు. కార్పొరేటర్ పల్లా అప్పలకొండతో కలిసి ఆయన వార్డులోని పీతానివీధి, బంగారమ్మ గుడి ప్రాంతాలలో కాలువలు, సీసీ రోడ్లు, పారిశుధ్యం పనులను పరిశీలించారు. జీవీఎంసీ అందిస్తున్న సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



వైద్య ఆరోగ్య, విద్య అధికారుల క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): జిల్లా వైద్య, ఆరోగ్య, విద్యా శాఖాధికారులు రూపొందించిన క్యాలెండర్‌ను డీఎం హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విస్తరణ, మీడియా అధికారి బి.నాగేశ్వరరావు, వైద్య విద్య అధికారి ధర్మేంద్ర, జిల్లా మలేరియా అధికారి వై.మణి తదితరులు పాల్గొన్నారు.

8న వైదిక సదస్సు

సీతంపేట(విశాఖ ఉత్తర): శంకరమఠంలో ఈ నెల 8వ తేదీన కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి పురోహిత, అర్చక వర్గ సభ్యులతో వైదిక సదస్సు నిర్వహించనున్నారు. విజయయాత్ర సందర్భంగా ఆయన శంకరమఠానికి ఇటీవల విచ్చేయగా.. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారం సాయంత్రం 6 గంటలకు వైదిక సదస్సు నిర్వహిస్తున్నారని.. అర్చక, పురోహితులు స్వామి అనుగ్రహాన్ని పొందగలరని శంకరమఠం ప్రతినిధులు ఓ ప్రకటనలో కోరారు. సదస్సులో పాల్గొనే వారు 94415 03935, 99898 93557లో సంప్రదించవచ్చు.

నిర్వహణలో నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- నిరుపయోగంగా నెహ్రూనగర్ కాలనీ పార్కు
- చెత్తతో నిండిన పరిసర ప్రాంతాలు



పార్కు ముఖ ద్వారం వద్ద పేరుకుపోయిన చెత్త



తుప్పు పట్టిన పార్కులోని వ్యాయామ పరికరాలు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఓ పార్కు నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. క్షీణించిన పారిశుధ్యంతో పరిసర ప్రాంతాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. నగర నడిబొడ్డున ఉన్న జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్‌లోని నెహ్రూనగర్ కాలనీ పార్కు కొద్ది నెలలుగా నిరుపయోగంగా ఉంది. ఈ పార్కు జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వంద అడుగుల దూరంలో ఉండడం గమనార్హం. అయినా పార్కు అభివృద్ధిని జీవీఎంసీ పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పార్కులో లక్షల రూపాయలు ఖర్చు చేసి వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. అయితే మిగతా సౌకర్యాలు లేకపోవడంతో ఇవి కూడా నిరుపయోగంగా మారి తుప్పుపట్టి పాడైపోతున్నాయి. కాసేపు సేద తీరడానికి బెంచీలు కూడా లేవు.

చెత్త నిల్వ కేంద్రంగా పార్కు!

మరో వైపు పార్కు గేటుకు తాళం వేయడంతో పూర్తిగా నిరుపయోగంగా మారింది. దీంతో కాలనీ వాసులు ముఖ ద్వారం వద్దే చెత్త వేసేస్తున్నారు. చెత్త నిల్వ కేంద్రంగా పార్కును మార్చేశారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కులో మౌలిక వసతులు కల్పించి, నిర్వహణపై దృష్టి సారించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తా..

నెహ్రూనగర్ పార్కును అభివృద్ధి చేస్తే పిల్లలు ఆడుకోవడంతో పాటు పెద్దలు వ్యాయామం చేయడానికి అనువుగా ఉంటుంది. ఇదే విషయం స్థానిక ప్రజలు నా దృష్టికి తీసుకొచ్చారు. జీవీఎంసీ సిబ్బంది కూడా పార్కును ఇటీవల సందర్శించారు. ఈ పార్కు అభివృద్ధి విషయమై జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. పార్కులో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తాను. – పల్లా దుర్గారావు, 28వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి

నగర సుందరీకరణకు తొలి ప్రాధాన్యం

- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



ఫిషింగ్ హార్బర్ రోడ్డులో పర్యటిస్తున్న కమిషనర్

ఆరిలోవ(విశాఖ తూర్పు): సుందర విశాఖ నగరాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడమే ప్రధాన కర్తవ్యమని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అన్నారు. గురువారం ఫిషింగ్ హార్బర్ నుంచి జోడుగుళ్లపాలెం వరకు అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నగరానికి పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుందని, సదస్సులు, సమ్మిట్‌లు, నేషనల్ ఈవెంట్లు జరుగుతాయని, వీటిని దృష్టిలో ఉంచుకుని నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలని చెప్పారు. ముఖ్యంగా బీచ్ రోడ్డులో పారిశుధ్యం, భూగర్భ డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి, రోడ్లు, కాలువలు, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, పెయింటింగ్‌లు, ప్రజా మరుగుదొడ్ల శుభ్రత వంటి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొత్త జాలరిపేట మరుగుదొడ్ల ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు ఎత్తివేయించాలని, ఆ ప్రదేశంలో మొక్కలు పెంచేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, జోనల్ కమిషనర్ శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, డీసీపీ, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్, సహాయక ఇంజినీరు పాల్గొన్నారు.

సీహెచ్‌వో, ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మద్దిలపాలెం: సీహెచ్‌వోలు, ఎంఎల్‌హెచ్‌పీల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రాంతీయ మహిళా శిక్షణా కేంద్రంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్.పి.జగదీశ్వరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని జాతీయ కార్యక్రమాలపై సంబంధిత ప్రొగ్రాం అధికారుల ద్వారా శిక్షణ ఇవ్వాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగ్యూ నియంత్రణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను కూలంకషంగా వివరించాలన్నారు. కోవిడ్ వ్యాక్సినేషన్ తోపాటు, సాధారణ వ్యాక్సినేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. మాతా, శిశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ బి.సుజాత, డీపీఎం, ఎన్‌హెచ్ఎం డాక్టర్ ఎస్.రమారెడ్డి, బద్రీనాథ్ పాల్గొన్నారు.

నిబద్ధతకు మారుపేరు రామకృష్ణంరాజు



రామకృష్ణంరాజు చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

మురళీనగర్(విశాఖ ఉత్తర): శ్రీదేవి కేబుల్ టీవీ చానల్ చైర్మన్ దివంగత ఇసుకపల్లి రామకృష్ణంరాజు నిబద్ధతకు మారుపేరుగా నిలిచారని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. మురళీనగర్‌లో గురువారం జరిగిన సంస్మరణ కార్యక్రమంలో మేయర్ దంపతులు పాల్గొని రామకృష్ణంరాజు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రామకృష్ణంరాజు అతి సామాన్య వ్యక్తిగా జీవితాన్ని ప్రారంభించి నిబద్ధతతో పనిచేసి ఉన్నత స్థానానికి ఎదిగారన్నారు. డిజిటల్ ప్రసారాల్లో కొత్త అధ్యాయాన్ని సృష్టించారని, కేబుల్ రంగంలో ఆయన సేవలు మరువలేనివన్నారు. రామకృష్ణంరాజు కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి, ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుకపల్లి రామకృష్ణంరాజుకు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, గొలగాని శ్రీనివాస్, మహారాజా బ్యాంకు చైర్మన్ మంతెన రామకృష్ణరాజు, ఎంఎస్‌వోలు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

పాత్రికేయుల సంక్షేమ బాధ్యత ప్రభుత్వానిదే



టాస్ వేస్తున్న బొలిసెట్టి, తదితరులు

విశాఖ స్పోర్ట్స్: అంతర మీడియా స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా గురువారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోర్ట్ మైదానంలో ఈ పోటీలను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిసెట్టి సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్యులకు అండగా నిలిచే పాత్రికేయుల సంక్షేమ బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. వీజేఎఫ్‌కు సుదీర్ఘ కాలం పాటు సేవలందించిన దుర్గారావు, శ్రీదేవి చానల్ రామకృష్ణరాజు, బీజేపీ నాయకుడు పి.వి.చలపతిరావు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీజేఎఫ్, విస్జా ప్రతినిధులు, క్రికెట్ జట్ల సభ్యులు పాల్గొన్నారు. ఇప్పటికే అథ్లెటిక్స్, ఇండోర్ క్రీడలు ముగియగా.. క్రికెట్ పోటీలు ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

లోకల్ చానల్, కెమెరామెన్ జట్ల విజయం

తొలిరోజు జరిగిన పోటీల్లో లోకల్ చానెల్ జట్టు ఐదు వికెట్ల తేడాతో ప్రజాశక్తి జట్టుపై విజయం సాధించింది. ప్రజాశక్తి జట్టు తొలుత బ్యాటింగ్ చేసి మూడు వికెట్లకు 87 పరుగులు చేయగా.. లోకల్ చానల్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. మరో పోటీలో కెమెరామెన్ జట్టు ఆరు వికెట్లకు 127 పరుగులు చేయగా.. వెబ్ చానల్స్ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 84 పరుగులతో ఆటను ముగించింది.

కొలువుదీరిన వాసవీ క్లబ్ వనిత కార్యవర్గం

అల్లిపురం: వాసవీ క్లబ్ వనిత (కేజీ గుప్తా ఫెలో వైజాగ్ ఫెమినా క్లబ్) నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గోల్డెన్ కేజీ గుప్తా గవర్నర్, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షురాలిగా ఎస్.సుభద్ర, కార్యదర్శిగా సీహెచ్ గాయత్రి, కోశాధికారిగా కేవీ సూర్యకుమారి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కందుల నాగరాజు చేతుల మీదుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

అవయవ దానంపై అవగాహన

బీచ్ రోడ్డు: ఎన్జీవో మోహన్ ఫౌండేషన్ సహకారంతో మూడు వారాల పాటు అవయవ దానంపై అవగాహన కార్యక్రమం చేపట్టనున్నట్టు ఎడెల్ వైజ్ టోకియో లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ఎండీ సుమిత్ రాయ్ తెలిపారు. బీచ్ రోడ్డులో గురువారం అవయవ దానంపై నిర్వహించే అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిందగీ ఎక్స్‌ప్రెస్ పేరుతో మూడు వారాల పాటు దేశ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వస్తామన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



డాబాగార్డెన్స్: సహస్రాది తులసీ దళాల నడుమ సిరులతల్లి కనకమహాలక్ష్మి అమ్మవారు నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి ఆలయంలో గురువారం సహస్ర తులసి పూజను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు, ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వి. రాంబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

45 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార: గుట్టుగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్తుటౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖ రైల్వేస్టేషన్ గేట్ – 2 కారు పార్కింగ్ వద్ద రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌కు చెందిన ఎం.డి.షరీఫ్, షారుక్‌ఖాన్, ఇన్‌షాఫ్ ఖాన్ గంజాయి తరలిస్తున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు సారథ్యంలో సిబ్బంది దాడి చేసి ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా 45 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని, వారిని ఫోర్తుటౌన్ పోలీసులకు అప్పగించారు. రూ.8,300 నగదు, మూడు ఫోన్లు వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు.

రౌడీమూకల దాడిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తకు గాయాలు



గాయపడ్డ సుధాకర్

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ 36వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీకి చెందిన కుందేటి సుధాకర్‌పై కొంత మంది రౌడీమూకలు గురువారం సాయంత్రం దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సుధాకర్‌ను వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం సుధాకర్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై బాధితుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు.

కృష్ణా కళాశాలలో ఇంటర్న్‌షిప్‌పై శిక్షణ



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్ షిప్ నిర్వహణపై శిక్షణ ఇస్తున్నట్టు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ తెలిపారు. కృష్ణా కళాశాలలో లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంపై మూడు రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రైనింగ్ ప్రొగ్రామ్, ట్రైనర్స్ ఆఫ్ ట్రైనర్స్ పేరిట ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. బ్యాచ్‌ల వారీగా ఐదు విడతలుగా నిర్వహించనున్నామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ఫిబ్రవరి మొదటి వారం వరకూ కొనసాగుతుందని, నైపుణ్యాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్ షిప్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి.రాజశేఖర్, డాక్టర్ ఎన్.శంకర్, డాక్టర్ లలిత, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రవిబాబు, అధ్యాపకులు డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, వి.సుధీర్, వి.రత్నభారతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా కొత్త పింఛన్ల పంపిణీ



15వ వార్డులో కొత్త పెన్షన్‌దారులకు సొమ్ము అందిస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు



కొత్త పెన్షన్లు అందిస్తున్న పుక్కళ్ల ధనలక్ష్మి

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డులో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం ఉత్సాహంగా సాగింది. వార్డు పరిధిలోని 5 సచివాలయాల్లో 51 మంది లబ్ధిదారులకు కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయి. స్థానిక సచివాలయ అధికారుల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి లబ్ధిదారులందరికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్ అందజేస్తున్నారన్నారు. రూ.2500 నుంచి పెన్షన్ రూ.2750కి పెంచడం ద్వారా అవ్వాతాతలపై సీఎంకు ఉన్న అభిమానం మరోసారి తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎల్లాజీ, అప్పన్న, జగదీష్, సతీష్, ఈశ్వరరావు, చంటి, జ్యోతి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

15వ వార్డులో..

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీలో కొత్తగా మంజూరైన పెన్షన్లను కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కన్వీనర్లు నరాల సత్తిబాబు, ఉషా, గొలగాని త్రినాథ్, నారాయణరావు, సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో సుఖ సంతోషాల్లో ప్రజలు

- రాజకీయ భవిష్యత్తు లేదనే చంద్రబాబు గగ్గోలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో అక్కరమాని



23వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న అక్కరమాని

మద్దిలపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని, అది చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని 23వ వార్డు చైతన్యనగర్ కాలనీలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. స్థానిక కార్పొరేటర్ గుడ్ల విజయసాయితో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. వివిధ సంక్షేమ పథకాల వివరాలున్న బ్రోచర్లను అందించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడంలో చిత్తశుద్ధితో కృషి చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. లబ్ధిదారులు ఏమైనా సమస్యలను ఎదుర్కొంటుంటే వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్న సంక్షేమ పాలనకు ప్రజలు నీరాజనాలు పలుకుతుంటే, తమకు రాజకీయ భవిష్యత్తు లేదన్న భయంతోనే చంద్రబాబు ఇదేం కర్మని.. లబోదిబోమంటున్నారని ఎద్దేవా చేశారు. పేదవాడి గుండె విని, నేనున్నానని భరోసా ఇచ్చి, అధికారంలోకి రాగానే హామీలను పక్కాగా అమలు చేసిన నికార్సైన నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని కొనియాడారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎంకు రోటరీ క్లబ్ సత్కారం



మాట్లాడుతున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: రోటరీ క్లబ్ విశాఖపట్నం ప్రతినిధులు గురువారం డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) అనూప్‌కుమార్ సత్పతిని ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో డీఆర్‌ఎం ముఖ్య అతిథిగా మాట్లాడారు. తన గొప్పతనమంతా విశాఖవాసులు, ప్రజా ప్రతినిధులు, మీడియా, వాల్తేర్ టీం సభ్యులకు చెందుతుందని తెలిపారు. వీరందరి సహాయ సహకారాలతో ఈ ప్రాంత ప్రజలు, ప్రయాణికుల డిమాండ్‌లు, అవసరాలను తీర్చగలుగుతున్నానని చెప్పారు. రైల్వే ప్రయాణికులకు మరిన్ని సేవలందించే విషయంలో తన కృషి కొనసాగుతుందన్నారు. ప్రయాణికుల సౌకర్యాల మెరుగుకు వాల్తేర్ డివిజన్ తీసుకుంటున్న పలు చర్యలను గురించి ఆయన క్లుప్తంగా వివరించారు. భవిష్యత్తులో రైల్వేలో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన ప్రపంచ స్థాయి సదుపాయాలను అందుబాటులోకి తీసకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖపట్నం ప్రెసిడెంట్ బి.మధు, సెక్రటరీ జి.శ్రీనివాస్, ఇతర ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులు పాల్గొన్నారు.

సమాచారమ్

గ్రీటింగ్ కార్డుల తయారీపై 8న శిక్షణ

మద్దిలపాలెం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని బాల వికాస ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రీటింగ్ కార్డుల తయారీపై ఈ నెల 8న ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న బాలలు ఆ రోజు ఉదయం 10 గంటలకు ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీవీపీ డిగ్రీ కళాశాలలో జరిగే సెమినార్‌కు హాజరుకావాలని ఆయన సూచించారు. ప్రముఖ కార్టూనిస్ట్ పి.వి.ఆర్.మూర్తి నేతృత్వంలో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. గ్రీటింగ్ కార్డుల తయారీకి అవసరమైన రంగులు, బోర్డును వెంట తెచ్చుకోవాలని ఆయన పేర్కొన్నారు.

8న సంగీత విభావరి

మద్దిలపాలెం: యూఎస్ఏకు చెందిన నాద వినోద మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గాన గంధర్వ మణిహారం శీర్షికతో సంగీత విభావరిని ఈ నెల 8న డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నామని రసజ్ఞ సాంస్కృతిక సేవా సంస్థ ప్రతినిధి డాక్టర్ వి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ స్థాయిలో ప్రాచుర్యం పొందిన ప్రముఖ గాయనీ, గాయకులు అరుదైన కలయికలో విశాఖ వేదిగా తొలిసారి సంగీత విభావరి నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని తెలిపారు.

దయాల్‌బాగ్‌లో శిక్షణకు దరఖాస్తులు

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లో దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణామూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 వారాలు, ఏడాది కాల వ్యవధి కోర్సులు ప్రారంభం కానున్నాయన్నారు. స్త్రీ, పురుషులు వయసుతో సంబంధం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 10 వారాల టై అండ్ డై మోడ్యులర్ కోర్సుకు 8వ తరగతి చదువుకున్న స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. ఒక సంవత్సరం కోర్సులైన డ్రెస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్‌కు 10వ తరగతి ఉత్తీర్ణులైన స్త్రీలు అర్హులన్నారు. టెక్స్‌టైల్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్ కోర్సుకు 10వ తరగతి ఉత్తీర్ణులై(మగ/ఆడ) ఉండాలన్నారు. కటింగ్ అండ్ సూయింట్‌కు 8వ తరగతి చదువుకున్న స్త్రీలు మాత్రమే అర్హులని తెలిపారు. మోడర్న్ ఆఫీస్ మేనేజ్‌మెంట్ అండ్ సెక్రటేరియట్ ప్రాక్టీస్‌కు ఇంటర్ చదువుకున్న స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. ఆయా కోర్సుల్లో శిక్షణ కోసం ఈ నెల 11వ తేదీలోగా విశాలాక్షినగర్‌లోని దయాల్‌నగర్ ఇన్‌స్టిట్యూట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 99633 40611 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.